జిల్లాకేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, నాయకులు

హైదరాబాద్‌లోని తన నివాసంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి



నగరంలోని రైల్వేకమాన్ వద్ద జడ్పీచైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు..



కోటగిరిలో నివాళులర్పిస్తున్న నాయకులు, గ్రామ యువకులు

దివంగత మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని జిల్లావ్యాప్తంగా శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ సంఘాల నాయకులు బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి, వెనుకబడిన వర్గాల కోసం ఆయన చేసిన కృషిని కొనియాడారు.

– నమస్తే తెలంగాణ యంత్రాంగం, ఏప్రిల్ 5

చందూర్‌లో నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

గడ్కోల్‌లో గ్రామ యువకులు..



జిల్లాకేంద్రంలో కాంగ్రెస్ నాయకులు..

ధర్పల్లి తహసీల్ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది..

సాలూరాలో నివాళులర్పిస్తున్న ఎంపీపీ సావిత్రీరాజేశ్వర్

కమ్మర్‌పల్లిలో ఏవైఎస్ నాయకులు..

జిల్లాకేంద్రంలో బార్ అసోసియేషన్ ప్రతినిధులు..

ఆర్మూర్‌లో బీఆర్ఎస్ నాయకులు..

మోర్తాడ్‌లో..



భీమ్‌గల్‌లో దళిత ఐక్య సంఘటన నాయకులు..

రుద్రూర్‌లో ..

రెంజల్ మండలం నీలాలో దండోరా సంఘం ఆధ్వర్యంలో..

## నేడు వేల్పూర్ ఎక్స్ రోడ్డులో ధర్నా

వేల్పూర్, ఏప్రిల్ 5: వేల్పూర్ ఎక్స్ రోడ్డులో శనివారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు ఆర్టీఏ సభ్యుడు రేగుల రాములు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ధాన్యానికి రూ.500 బోనస్ అందించాలని, వడగళ్ల వానకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతూ ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ధర్నాకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. నియోజకవర్గంలోని రైతులు, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు హాజరు కావాలని కోరారు.

## పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

మాక్లూర్, ఏప్రిల్ 5: మండల కేంద్రంలో శుక్రవారం 389 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశామని పశు వైద్యాధికారి ఉమామసాహెర్ తెలిపారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది వినిత, అహ్మద్‌పాషా, సుధీర్, జైల్ సింగ్, శ్రీను, గంగాధర్, పుష్ప, లక్ష్మి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## భూసార పరీక్షలపై అవగాహన

కమ్మర్‌పల్లి, ఏప్రిల్ 5: మండలంలోని బషీరాబాద్‌లో శుక్రవారం గ్రోమోర్ కోరమాండల్ సంస్థ ప్రతినిధులు భూసార పరీక్షలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. పంట నేలలో కార్బన్ వల్ల ఉపయోగాలు, దాని ఆవశ్యకత, భూసార పరీక్షల కోసం మట్టి నమూనాల సేకరణ విధానంపై వివరించారు. రైతులు తెచ్చిన మట్టి నమూనాలతో భూసార పరీక్షలు నిర్వహించారు. రైతులు మట్టి నమూనాలు తెచ్చుకుంటే శనివారం కూడా భూసార పరీక్షల నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సక్కారం అశోక్, సంస్థ ప్రతినిధులు వైష్ణవ్, మనోహర్, మ్యారేజ్ ఖాన్, రైతులు పాల్గొన్నారు.

## ముస్లింలకు ఇఫ్తార్

శక్కర్‌నగర్, ఏప్రిల్ 5: బోధన్ పట్టణంలోని గంజ్‌రోడ్డులో పట్టణ బిల్డింగ్ పెయింటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. మతాలకు అతీతంగా బోధన్‌లో పండుగలను జరుపుకొంటామని, ఇందులో భాగంగానే ఇఫ్తార్ ఏర్పాటు చేశామని ఆ సంఘం అధ్యక్షుడు కనకరాజు తెలిపారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి షేక్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు వీహెచ్‌పీ కార్యకర్తల సమావేశం

సుభాష్‌నగర్, ఏప్రిల్ 5 : విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ కార్యకర్తల యోజన బైఠక్ కార్యక్రమాన్ని బస్వాగార్డెన్‌లో నేడు (శనివారం) సాయంత్రం 6 గంటలకు నిర్వహించనున్నట్లు నిర్వహణ ప్రతినిధి ధార్మిక రమేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

## రాష్ట్రస్థాయి చిత్ర కళా కారిణికి సన్మానం

రాష్ట్రస్థాయి చిత్రకారిణిని సన్మానిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

బోధన్, ఏప్రిల్ 5: బోధన్ పట్టణం తట్టికోట్‌లోని దండోరా సంఘ భవనంలో శుక్రవారం రాష్ట్రస్థాయి చిత్ర కళా కారిణి అవంతికను ఎమ్మార్పీఎస్ నాయకులు సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి అద్దంకి లింగన్న మాట్లాడుతూ నిరుపేద దళిత కుటుంబంలో పుట్టిన అవంతిక గత నెలలో వరంగల్ కేంద్రంగా 'సాగంటి ఆర్ట్ అకాడమీ' ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఆన్‌లైన్ డ్రాయింగ్ పోటీల్లో ఉత్తమ చిత్ర కారురాలిగా అవార్డు అందుకున్నట్లు తెలిపారు. మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రాం జయంతిని పురస్కరించుకుని అవంతికను సన్మానించామని, ఇలాంటి కళాకారులకు, ఉన్నత విద్యనభ్యసించే వారికి తమవంతు సహకారం అందిస్తామని లింగన్న అన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు అద్దంకి హుసాన్, చంద్రయ్య, పోశెట్టి, సుధాకర్, లక్ష్మణ్, డ్రాయింగ్ టీచర్ సావిత్రి తదితరులు ఉన్నారు.

## ఆర్ఎంపీని బెదిరించి దోపిడీ చేసిన దొంగల అరెస్ట్

జక్రాన్‌పల్లి, ఏప్రిల్ 5 : ఆర్ఎంపీని బెదిరించి దోపిడీకి పాల్పడిన నిందితులను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొలిప్యాక్ గ్రామానికి చెందిన ఆర్ఎంపీ పసుల గంగాధర్‌ను చికిత్స చేయాల్సి ఉందని చెప్పి ఈనెల ఇద్దరు వ్యక్తులు బైక్‌పై ఎక్కించుకుని గ్రామశివారులోని నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లారు. కత్తితో బెదిరించి డాక్టర్ వద్ద ఉన్న బంగారు ఉంగరంతో పాటు రూ. 5000 నగదు, సెల్‌ఫోన్‌ను ఎత్తుకెళ్లారు. ఆర్మూర్ వడ్డెర కాలనీకి చెందిన చిన్నగంగాధర్ అలియాస్ దేవల నర్సయ్య, తొర్లికొండకు చెందిన కాట్‌పల్లి సతీశ్ అలియాస్ గంగా రెడ్డిని నిందితులుగా గుర్తించి వారిని అరెస్టు చేసినట్లు వెల్లడించారు. నిందితుల నుంచి బంగారు ఉంగరం, సెల్‌ఫోన్, రూ. 1500, బైక్‌ను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించామని ఎస్సై తెలిపారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ

సారంగాపూర్, ఏప్రిల్ 5 : రూరల్ మండలంలోని మల్కాపూర్ తండాకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు ప్రేమ్‌దాస్‌నాయక్ తండ్రి శుక్రవారం మృతిచెందాడు. మృతదేహానికి రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, ధర్పల్లి జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ నివాళులర్పించి, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బాజిరెడ్డి వెంట బీఆర్ఎస్ నాయకులు కోర్వ దేవేందర్, అన్నం సాయిలు, అశోక్, గోపాల్‌నాయక్, శ్రీనివాస్‌రావు, గంగారాంనాయక్, ప్రకాశ్‌నాయక్ తదితరులు ఉన్నారు.

## కుమారులు గొడవ పడుతున్నారని తల్లి ఆత్మహత్య

నవీపేట, ఏప్రిల్5: వ్యవసాయ భూమి పంపకాల విషయంలో ఇద్దరు కుమారులు తరుచూ గొడవ పడుతుండడంతో మనస్తాపానికి గురైన ఓ తల్లి చెరువులో దూకి తనువు చాలించిన ఘటన శుక్రవారం మండలంలోని నాగేపూర్‌లో చోటుచేసుకోంది. స్థానిక ఎస్సై యాద గిరిగౌడ్ కథనం ప్రకారం.. నాగేపూర్ గ్రామానికి చెందిన కోండ్ర గంగామణి (54)కి ప్రవీణ్, శ్రీనివాస్ కుమారులు ఉన్నారు. వారికి ఉన్న పది గుంటల వ్యవసాయ భూమి పంపకాల్లో తేడాలు వచ్చాయి. కొన్ని రోజుల నుంచి కుమారులు తరుచూ గొడవ పడుతున్నారు. ఎంత చెప్పినా కుమారులు వినకపోవడంతో తల్లి మనస్తాపానికి గురై గురువారం గ్రామ శివారులోని నాగుల కుంట చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. కుమారుడు ప్రవీణ్ ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### ఆర్థిక ఇబ్బందులతో మాజీ సైనికుడు..

జక్రాన్‌పల్లి, ఏప్రిల్ 5 : మండలంలోని పడకల్ గ్రామానికి చెందిన మాజీ సైనికుడు బోండ్ల భరత్ (30) ఆర్థిక ఇబ్బందులతో గురువారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. గతంలో ఆర్మీ జవాన్‌గా పనిచేసిన భరత్.. విధులకు హాజరు కాకపోవడంతో ఉద్యోగం కోల్పోయాడని, ఆర్థిక సమస్యలతో మనస్తాపం చెంది ఉరేసుకోగా.. అతడి తల్లి గమనించి దవాఖానకు తరలించేలోపే మృతిచెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### రైలు కింద పడి మరో వ్యక్తి..

వినాయక్‌నగర్, ఏప్రిల్ 5 : నిజామాబాద్ – డిచ్‌పల్లి రైల్వేస్టేషన్ల మధ్యలో గురువారం రాత్రి ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 50 ఏండ్లు ఉంటుందని చెప్పారు. మృతుడికి సంబంధించిన ఆధారాలు లభించలేదని, మృతుడి చేతిపై హిందీలో శంకర్ అని పచ్చబొట్టు ఉందని వెల్లడించారు. సంబంధీకులు నిజామాబాద్ రైల్వే స్టేషన్‌లో లేదా 87126 58591 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

## ఘనంగా విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

■ పూజల్లో పాల్గొన్న బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

రుద్రూర్, ఏప్రిల్ 5 : మండలంలోని అంబం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న లక్ష్మీపూర్ క్యాంపు రామాలయంలో విగ్రహ, ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో బాన్సువాడ ఎమ్మెల్యే, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి హాజరై పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యుడు సురేశ్, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

పూజల్లో పాల్గొన్న బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

చేంగల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

బీమ్‌గల్/ నవీపేట, ఏప్రిల్5: బీమ్‌గల్ మండలంలోని చేంగల్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించినట్లు ఐకేపీ సీసీ గడాల రఘుపతి తెలిపారు. క్వింటాలుకు 'ఏ' గ్రేడు ధర రూ.2203, 'బీ' గ్రేడు రకానికి రూ.2183 మద్దతు ధరను ప్రభుత్వం కల్పిస్తున్నదని అన్నారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నవీపేట మండల కేంద్రంలో స్థానిక సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సీఈవో మహేశ్ ప్రారంభించారు. కార్యక్రమంలో సొసైటీ వైర్మన్ న్యాలకంటి అబ్బన్న, వ్యవసాయశాఖ ఏఈవో సుప్రియ, డైరెక్టర్లు గణేశ్, సొద శ్రీనివాస్, రాము, గోపి ఆయా గ్రామాల రైతులు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఇచ్చిన హామీలు ఎటుపాయే?

రైతు ధర్నాలో ఎంపీ ధర్మపురి అరవింద్

వినాయక్‌నగర్, ఏప్రిల్ 5 : అధికారం చేపట్టిన 100 రోజుల్లో హామీలను నెరవేర్చుతామని కాంగ్రెస్ పార్టీ చెప్పిందని, హామీలన్నీ ఎటుపాయె అని ఎంపీ ధర్మపురి అర్వింద్ ఎద్దేవా చేశారు. ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, వాటిని అమలుచేయడంలో విఫలమయ్యిందని ధ్వజమెత్తారు. జిల్లాకేంద్రంలోని ధర్నాచౌక్‌లో కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన రైతు ధర్నా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు రుణమాఫీ కోసం కమిషన్‌ను ఏర్పాటు చేస్తామని మాయమాటలు చెబుతున్నారని, రూ. 500 బోనస్ ఎటుపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులను మోసం చేస్తున్న రేవంత్‌రెడ్డికి పుట్టగతులుండవని, పాపం పండే రోజులు త్వరలోనే వస్తుందని శాపనార్థాలు పెట్టారు. షుగర్ ఫ్యాక్టరీ తెరిపించడం కాంగ్రెస్ ప్రభుత్వానికి చేతకాదని, ఫ్యాక్టరీ గేటును కూడా వారు తెరిపించలేరని అన్నారు. రేవంత్‌రెడ్డి, సోనియాగాంధీ సైతం అవినీతిపరులే అని ఆరోపణలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

## ఫకీరు వేషంలో భిక్షాటనకు వచ్చి ఇంట్లో చొరబడి రూ.40వేలు చోరీ

సీసీ కెమెరాలో రికార్డయిన నిందితుడు

నవీపేట, ఏప్రిల్ 5: భిక్షాటనకు ఫకీరు వేషంలో వచ్చిన ఓ బాబా ఇంట్లో చోరీకి పాల్పడిన ఘటన మండలంలోని నాళేశ్వర్ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. శుక్రవారం స్థానిక ఎస్సై యాద గిరిగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. నాళేశ్వర్ గ్రామానికి ఫకీరు వేషధారణలో ఉన్న ఓ వ్యక్తి సుంకరి పోశెట్టి ఇంటికి భిక్షాటన కోసం వెళ్లాడు. ఆ సమయంలో పోశెట్టి కూతురు నవనీత ఇంట్లో ఉంది. పోశెట్టి బతుకు దెరువుకోసం దుబాయ్ వెళ్లాడు. యువతి తల్లి సాయమ్మ వ్యవసాయ పనులకు, సోదరుడు నరేశ్ సొంత పనుల నిమిత్తం నిజామాబాద్ వెళ్లారు. ఒంటరిగా ఉన్న యువతిని గమనించిన ఫకీర్ బాబా మాయ మటలు చెప్పి తన వద్ద ఉన్న నెమలి ఈకల కట్టతో యువతి తలపై పెట్టడంతో ఆమె స్పృహ తప్పి పడిపోయింది. ఇంట్లో గాలింపు చేపట్టిన ఫకీర్‌బాబా సెల్ఫ్‌లో దాచి ఉంచిన రూ. 40 వేల నగదును దోచుకొని టీవీఎస్ ఎక్స్‌ఎల్ మోటర్ సైకిల్‌పై పారి పోయాడు. నిందితుడి ఫోటో సీసీ కెమెరాల్లో రికార్డ్ అయ్యింది. నిందితుడిని పట్టుకునేందుకు రెండు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగినట్లు ఎస్సై చెప్పారు. సాధ్యమైనంత త్వరలో పట్టుకుంటామని అన్నారు. బాధితురాలు సాయమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

## సంక్షిప్తంగా..

■ **నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం** - డిచ్‌పల్లి, ఏప్రిల్ 5 : మండలంలోని రాంపూర్, మిట్టాపల్లి, కమలాపూర్ గ్రామాల్లో నేడు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీ శ్రీనివాస్, ఏఈ సాయిలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాల్లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

■ **నేడు ఓపీవోలకు శిక్షణ** - ధర్పల్లి, ఏప్రిల్ 5 : మండల పరిషత్ కార్యాలయంలో సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఓపీవోలకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నేడు (శనివారం) ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ మాలతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు శిక్షణ ప్రారంభమవుతుందని, ఓపీవోలు సకాలంలో హాజరుకావలని సూచించారు.

■ **10, 24న సదరం క్యాంపులు**- ధర్పల్లి, ఏప్రిల్ 5 : జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో ఈ నెల 10, 24న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సదరం క్యాంపులను నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బాలకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్యాంపునకు వెళ్లే వారు ఈనెల 6 నుంచి మీసేవ కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు.

■ **అంత్యక్రియల నిర్వహణకు ఆర్థిక సాయం** - కోటగిరి, ఏప్రిల్ 5 : మండల కేంద్రంలోని కోటకింది గల్లీలో ఉండే గాండ్ల వీరయ్య శుక్రవారం మృతిచెందాడు. అంత్యక్రియలు నిర్వహించేందుకు తేళ్ల రవికుమార్ యువసేన ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందశారు. కార్యక్రమంలో నిర్వాహకులు రవికుమార్‌తోపాటు కప్ప సంతోష్, పెద్ద కాపు శ్రీకాంత్, యోగేశ్ పాల్గొన్నారు.

■ **9న ఉగాది వేడుకలు** – సుభాష్‌నగర్, ఏప్రిల్ 5 : ఇందూరు యజ్ఞ సమితి, వాసవీ కన్యకా పరమేశ్వరి చారిటబుల్ ట్రస్ట్, బాసర సంస్కార భారతి –ఇందూరు శాఖ ఆధ్వర్యంలో ఈనెల 9న ఉగాది వేడుకలను నిర్వహించనున్నట్లు సమితి అధ్యక్షుడు మూఢ నాగభూషణం గుప్తా శుక్రవారం ప్రకటనలో తెలిపారు. జిల్లాకేంద్రంలోని నిఖిల్‌సాయిలో హోటల్‌లో ఉగాది పంచాంగ శ్రవణం, కవి సమ్మేళనం, అయోధ్య వైభవం, పుస్తకావిష్కరణ సభ ఉంటాయని, భాషాభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED

★Wanted Agents, Associates Franchise throughout Telangana for Abroad Medical College Admission. 8881116865 / 8881115253.

NT-311882-All

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ 4 లైన్ క్లాసిఫైడ్ 200/- మాత్రమే. ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలను ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి

డిచ్‌పల్లి, ఏప్రిల్ 5 : గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని డీపీవో తరుణ్‌కుమార్ సిబ్బందికి సూచించారు. మండలంలోని బర్ధిపూర్‌లో ఉన్న వాటర్‌ట్యాంకును ఆయన శుక్రవారం పరిశీలించారు. 10 రోజులకోసారి నీటి ట్యాంకులను శుభ్రం చేయాలని, వాటి పరిసరాలను శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ఆయన వెంట గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్‌గౌడ్, కార్యదర్శి వసంతరావు, సిబ్బంది ఉన్నారు.

మోపాల్ మండలం నర్సింగ్‌పల్లిలోని ఇందూరు తిరుమల ఆలయంలో ఏడు రోజులపాటు కొనసాగిన బ్రహ్మోత్సవాలు శుక్రవారం సంపూర్ణమయ్యాయి. ఇందులో భాగంగా శ్రీ పుష్పయోగం, 108 కలశాల్లో గంగ నీటిని తీసుకువచ్చి స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

– మోపాల్ (ఖలీల్‌వాడి), ఏప్రిల్ 5

## నోవా వరల్డ్ రికార్డు సాధించిన ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు

రుద్రూర్, ఏప్రిల్ 5 : మండలకేంద్రానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు యోగా సాధనలో నోవా వరల్డ్ రికార్డు సాధించారు. ఇందుకు సంబంధించిన సర్టిఫికెట్‌ను నిర్వాహకులు ఆన్‌లైన్‌లో గురువారం సాయంత్రం అందజేశారు. రథసప్తమి సందర్భంగా 17 ఫిబ్రవరి 2024న ఇండియన్ యోగా అసోసియేషన్, యోగాలయ హెల్త్‌కేర్ ఇనిస్టిట్యూట్ –తమిళనాడు ఆధ్వర్యంలో 108 రౌండ్‌ల సూర్య నమస్కార సాధన పోటీలను నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం నుంచి పతంజలి యజ్ఞ సహిత యోగాకేంద్రం –రుద్రూర్ నుంచి ఒకే కుటుంబానికి చెందిన విశ్వనాథ్‌మహాజన్, అతడి కూతురు అక్షయ శ్రీ, కుమారుడు అద్వైత్ మహాజన్ ముగ్గురు పాలొన్నారు. వీరు ముగ్గురూ పోటీల్లో ప్రతిభ కనబర్చడంతో నోవా వరల్డ్ రికార్డు ప్రశంసాపత్రాన్ని అందజేశారని విశ్వనాథ్ మహాజన్ తెలిపారు. తమ కుటుంబం నుంచి ముగ్గురూ ప్రశంసాపత్రం అందుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. నోవా రికార్డును గ్రామస్తులకు అంకితం చేస్తున్నట్లు చెప్పారు.

## వేర్వేరు సంఘటనల్లో ఇద్దరు అదృశ్యం

శక్కర్‌నగర్, ఏప్రిల్ 5: బోధన్ పట్టణానికి చెందిన ఆరేండ్ల బాలుడితోపాటు మరో వ్యక్తి వేర్వేరు సంఘటనల్లో అదృశ్యం అయ్యారు. వారి కుటుంబీకుల నుంచి అందిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ ఎస్.వీరయ్య తెలిపారు. బోధన్ పట్టణం గోసంబస్తీకి చెందిన రేణుక అనే మహిళ తన ఆరేండ్ల కుమారుడు రాఘవను తీసుకుని శుక్రవారం రాకాసీ పేట్ హనుమాన్ మందిరం వద్ద కూలీ పనులకు వెళ్లింది. బాలుడు ఆడుకుంటానని వెళ్లి కనిపించకుండా పోయాడు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేకపోవడంతో రేణుక పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాలుడి కోసం రెండు బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టామని, కేసు దర్యాప్తు చేస్తున్నామని పట్టణ సీఐ వీరయ్య తెలిపారు.

**లారీపై వెళ్లిన ముజఫర్ హుస్సేన్..**

గత నెల 27వ తేదీన బోధన్ పట్టణం తట్టికోట్‌కు చెందిన ముజఫర్ హుస్సేన్ అలియాస్ అన్వర్ హుస్సేన్ కూలీ పనుల కోసం వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని ఆయన సోదరుడు జాఫర్ హుస్సేన్ శుక్రవారం బోధన్ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వకీల్ చావూస్ అనే వ్యక్తికి చెందిన లారీపై డ్రైవర్ బుజుర్గ్‌తో కలిసి కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ ప్రాంతాల నుంచి ఎముకల కోసం వెళ్లారు. బోధన్‌కు డ్రైవర్ ఒక్కడే తిరిగి వచ్చాడని జాఫర్ హుస్సేన్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ తెలిపారు.